
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



16 రాజన్న సిరిసిల్ల
సోమవారం | 28-8-2017

తెలంగాణ జాతికే అగ్రభాగాన సిరిసిల్ల



మాట్లాడుతున్న గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ అయాచితం శ్రీధర్

- కవుల మార్గం ఏదైనా ప్రజల మేలు కోసమే
- రచయితలు, కవులు తెలంగాణ వాణిని వినిపించాలి
- గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ ఆయాచితం శ్రీధర్
- జాగృతి కవితాంజలి.. 70 మంది కవుల కవితాగానం

◆ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల 16

60 లక్షల చీరలు రెడీ..



"బతుకమ్మ".. తెలంగాణలో ఆడపడుచులకు ఇష్టమైన పండుగ. ఈ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు కానుక ఇవ్వాలని నిర్ణయించింది. రంజాన్, క్రిస్‌మస్‌లకు బట్టలు అందించినట్లే బతుకమ్మ పండుగకు కూడా ఆడపడచులకు చీరలను కానుకగా అందించడానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కోటి 4 లక్షల 57వేల 610 మంది లబ్ధిదారులకు అవసరమయ్యే చీరల ఉత్పత్తిని తయారు చేసే అవకాశం సిరిసిల్ల నేత కార్మికులకే ఇచ్చింది. రూ.120 కోట్లతో సిరిసిల్ల కార్మికులకు దాదాపు 4 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి చేయడానికి అవకాశం లభించింది. బతుకమ్మ పండుగ ప్రారంభంలోనే సెప్టెంబర్ 18, 19, 20వ తేదీలలో ఈ చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటు తెలంగాణ ఆడపడుచులకు కానుకతోపాటు నేత కార్మికుల బతుకులకు భరోసానిస్తూ బతుకమ్మ పండుగతో ప్రభుత్వం అందరికీ ఆనందాన్ని పంచుతోంది.

- రూ. 120 కోట్ల విలువైన వస్త్రాల తయారీతో మరమగ్గాలపై రంగుల కళ
- ఆడపడచులకు కానుక.. నేతన్నకు ఉపాధి
- జిల్లా మహిళలకు 2 లక్షల చీరలు
- సెప్టెంబర్ 18, 19, 20వ తేదీల్లో పంపిణీకి ఏర్పాట్లు
- సిరిసిల్ల నేతన్నల కుటుంబాల్లో ఆనందం నింపిన బతుకమ్మ చీరలు

◆ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల 2

అధికారుల అవినీతిపై

వాట్సప్ వీడియో వైరల్



- కాసులిస్తేనే మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారి
- సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్‌లో రూ.600 నుంచి వెయ్యి రూపాయల వరకు వసూళ్లు
- బాధితుల వాట్సాప్ వీడియో హల్‌చల్

రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్న పరిస్థితి నెలకొంది. భూముల కొనుగోళ్లకు ఎలాగూ మామూళ్లు తప్పడం లేదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులను కూడా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డబ్బుల కోసం పీడిస్తున్నారనే ఫిర్యాదులు ఎక్కువైపోతున్నాయి. కల్యాణ లక్ష్మిలో మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరమైన ఓ దరఖాస్తుదారుడి నుంచి సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది డబ్బులు తీసుకున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సిబ్బంది అవినీతిపై కడుపు మండిన ఓ లబ్ధిదారుడు మామూళ్లు ఇస్తుండగా తీసిన వీడియో ఇప్పుడు సంచలనంగా మారింది..

◆ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల 2

మిడ్ మానేరు ముంపు గ్రామాలను

ప్రజలు ఖాళీ చేయాలి..

- ఎగువ మానేరుకు 12.4 ఫీట్ల నీళ్లు
- కలెక్టర్ కృష్ణభాస్కర్

16

సహజ వనరులను దోచేస్తూ

ప్రాణాలు హరిస్తున్నారు..



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ప్రొఫెసర్ కాసీం

- స్వార్థపరుల చేతుల్లో తెలంగాణ
- ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టిస్తున్నారు
- నేరెళ్ల బాధితులను ఆదుకోవాలి
- ఉస్మానియా ప్రొఫెసర్ కాసీం

◆ వేములవాడ/తంగళ్లపల్లి 7

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని

అధికారికంగా నిర్వహించాలి

- నేరెళ్ల సంఘటనలో పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు
- సెప్టెంబర్ 1 నుంచి 7వరకు రాష్ట్ర పర్యటన
- 4న సిరిసిల్లలో బహిరంగ సభ
- బీజేపీ నేతల సమావేశం

◆ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల 2



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

60 లక్షల చీరల రెడీ..

● ఆడపడచులకు కానుక.... నేతన్నకు ఉపాధి ● సెప్టెంబర్ 18, 19, 20వ తేదీల్లో పంపిణీకి ఏర్పాట్లు



సిరిసిల్లలో తయారైన బతుకమ్మ చీరలు

ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల: తెలంగాణలో మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ బతుకమ్మ.. తొమ్మిది రోజుల పాటు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఎంతో ఉత్సహాంగా పండుగను జరుపుకుంటారు. ప్రభుత్వం రంజాన్, క్రిస్మస్‌లకు బట్టలు అందించినట్లే బతుకమ్మ పండుగకు కూడా ఆడపడచులకు చీరలను కానుకగా అందించడానికి శ్రీకారం చుట్టింది. మహిళల కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలో భాగంగా జిల్లాలో 2 లక్షల మందికి చీరలు అందనున్నాయి.

ఇక రాష్ట్రవ్యాప్తంగా కోటి 4 లక్షల 57610 మంది లబ్ధిదారులకు అవసరమయ్యే చీరల ఉత్పత్తిని తయారు చేసే అవకాశం సిరిసిల్ల నేత కార్మికులకే దక్కింది. ఉపాధి లేక తల్లాడిల్లుతున్న నేత కార్మికులకు బతుకమ్మ పండుగ వారి కుటుంబాల్లో నవ్వులను తెచ్చింది. రూ.120 కోట్లతో సిరిసిల్ల కార్మికులకు దాదాపు 4 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి చేయడానికి అవకాశం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ ప్రారంభంలోనే సెప్టెంబర్ 18, 19, 20వ తేదీలలో చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా మే నుంచి ఇప్పటివరకు 56 సొసైటీలు, ఎస్ఎస్ఐ యూనిట్ల ద్వారా 20 వేల మరమగ్గాలపై 60 లక్షల చీరలను ఉత్పత్తి చేసి సిద్ధంగా ఉంచారు. తయారైన చీరల్లో ఇప్పటికే 65 లక్షల మీటర్ల గ్రే క్లాత్‌ను ప్రింటింగ్ కోసం హైదరాబాద్‌కు పంపించి రంగు రంగుల డిజైన్లను ముద్రించారు. వివిధ రంగులకు సంబంధించి నేరుగా 32 లక్షల మీటర్లను సిరిసిల్ల మరమగ్గాలపై తయారు చేశారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బతుకమ్మ చీరల ఉత్పత్తిని సిరిసిల్ల పవర్‌లూం నేత కార్మికులు పట్టుదలతో పూర్తి చేయడంతో మూడు నెలలుగా నిరంతరం చేతినిండా పని దొరికింది. బతుకమ్మ చీరలతో పాటు ఇతర ఉత్పత్తులు కూడా సిరిసిల్లనేత కార్మికులకు అవకాశం ఇవ్వడంతో పండుగ వస్తుందంటేనే ఖర్చులను చూసి భయపడే కార్మికులకు బతుకమ్మ పండుగ వెలుగులను తీసుక వచ్చింది. బతుకమ్మ చీర జాకెట్ రూ.200 విలువగా ఉంటుంది. చీర పొడవు, 5.50 మీటర్లు కాగా... జాకెట్ 80 మిల్లీమీటర్లు ఉంటుంది.

కార్మిక కుటుంబాల్లో సిరినవ్వులు తెచ్చిన ప్రభుత్వం

ప్రభుత్వ ఆర్డర్‌లు ఇవ్వడంతోపాటు కొనుగోలు చేస్తుండడంతో కార్మికులకు చేతి నిండా పని దొరికింది. 2016-17 సంవత్సరంలో రూ.44.49 కోట్లు, 2017-18 సంవత్సరానికి కేటాయించిన వాటిలో రూ.180.98 కోట్ల బట్ట ఉత్పత్తిని అందించారు. రాజీవ్ విద్యామిషన్ ద్వారా యూనిఫాం కోసం రూ.42.50 కోట్ల విలువైన 1 కోటి 78 లక్షల 2981 మీటర్ల బట్టను ఇప్పటికే పూర్తి చేసి అందించగా అదే క్రమంలో ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.1.02 కోట్ల విలువైన 3 లక్షల మీటర్లు, ఎస్టీ సంక్షేమశాఖకు రూ.46 లక్షల విలువైన 1లక్ష 54వేల మీటర్లు, కస్తూర్బా పాఠశాలలకు రూ.47 లక్షల విలువైన 1 లక్ష 16వేల 734 మీటర్లు, 2017-18లో ఆర్‌వీఎం కోసం రూ 40.76 కోట్ల విలువైన 1 కోటి 3 లక్షల మీటర్లు, సంక్షేమ శాఖకు రూ12 కోట్ల విలువైన 30.60 లక్షల మీటర్ల బట్టను అందించారు. రెసిడెన్షియల్ పాఠశాలల పిల్లల కోసం రూ.4.40 కోట్ల విలువైన 9.50 లక్షల మీటర్ల బట్టను ఉత్పత్తి చేయించారు. దీనితోపాటు కేసీఆర్ కిట్ చీరల తయారీకి రూ.1 కోటి 33లక్షల విలువైన 6 లక్షల 46వేల 386 మీటర్ల ఆర్డర్‌లో 50 శాతం పూర్తి చేశారు.

కార్మికుడికి నెలకు రూ.15 నుంచి రూ.21 వేల కూలీ...

సిరిసిల్లలో ఒకప్పుడు 7వేల చేనేత మగ్గాలు ఉండేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతోపాటు మిల్లుల నుంచి వచ్చే పోటీ తట్టుకోలేక నేత కార్మికులు మహరాష్ట్రలోని భీవండి, షోలాపూర్, ముంబై, గుజరాత్‌లోని సూరత్ ప్రాంతాలకు మరమగ్గాలపై పని చేయడానికి వలసలు వెళ్లారు. అక్కడ పనులు నేర్చుకొని ఆ ప్రాంతాల్లో ఆధునిక మరమగ్గాలు రావడంతో లో టెక్నాలజీతో ఉన్న మరమగ్గాలను సిరిసిల్లకు తీసుకవచ్చి పరిశ్రమలు స్థాపించారు. ఇప్పుడు 35వేల మరమగ్గాల వరకు ఉన్నాయి. టెక్స్‌టైల్ పార్క్‌లో 1600 ఆధునిక మరమగ్గాలు ఏర్పడ్డాయి. చేనేత మగ్గాలనుంచి మరమగ్గాల వైపు మారినప్పటికీ ఉత్పత్తులు లేక కేవలం ఆసుపత్రుల్లో ఉపయోగించే పాలిస్టర్ వస్త్రాన్ని డెకరేషన్, లైనింగ్‌లకు ఉపయోగపడే వస్త్రాలనే తయారు చేసే వారు. కాటన్‌లో పెటికోట్స్‌కు వాడే వస్త్రాన్ని తయారు చేయడం వల్ల కూలీ కార్మికులకు అంతగా ధర గిట్టుబాటు కాలేదు. 12 గంటలు కష్టపడాండ నెలకు కార్మికుడికి రూ 4వేల నుంచి రూ.6వేల వరకు మాత్రమే వచ్చేవి. ప్రభుత్వం బట్ట ఉత్పత్తికి అవకాశం కల్పించడమే కాకుండా కూలీ కూడా నిర్ణయించడంతో ప్రస్తుతం కార్మికుడికి ప్రతి నెల రూ.15 వేల నుంచి రూ.21 వేల వరకు లభిస్తోంది. ఒక కార్మికుడు 8 మరమగ్గాల వరకు నడపగలుగుతాడు. బతుకమ్మ చీరలలో ఒక మరమగ్గంపై 35 మీటర్ల బట్ట వస్తుంది. దీని ప్రకారం రోజు 280 మీటర్లు వస్తుంది. దీనికి ఒక మీటర్‌కు రూ.2.25 పైసలు ఉండడం వల్ల రూ.630 సంపాదించగలుగుతాడు. కొందరు కార్మికులు పది మరమగ్గాలు కూడా నడుపుతున్నాడు.

ఇలాగే ఉంటే ఉపాధికి ఢోకా లేదు..

- వేముల రమేష్, మరమగ్గాల ఆసామి.



పది మరమగ్గాలు ఉన్నాయి. నూలు కోసం తిరిగేవాన్ని. యజమానులు బట్టకు గిరాకీ లేదని నూలు ఇచ్చే వారు కాదు. ప్రభుత్వం ఆర్డర్‌లు రావడం వల్ల ఎప్పుడు మరమగ్గాలు బంద్ పడ లేదు. ఇది ఇట్లానే ఉంటే పనికి ఢోకా లేదు. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నాం.

నాలుగు వేల వరకు పెరిగింది...

- గజ్జెల్లి శ్రీనివాస్, వైపని కార్మికుడు



ప్రభుత్వ ఆర్డర్‌లు రావడం వల్ల నాలుగు వేల రూపాయల కూలీ పెరిగింది. గతంలో మరమగ్గాలకు బీములు నింపితే (వైపని) రూ.8 నుంచి రూ.12వేల వరకు వచ్చేవి. ఇప్పుడు రూ.17 వేల వరకు వస్తోంది. పని కూడా ఎప్పుడు ఉంటోంది. బీముకు రూ.300 వస్తుంది. పని ఇట్లానే ఆత్మహత్యలు చేసుకోరు.

మరమగ్గాలపైనే ఇద్దరికీ ఉపాధి...

- కొండ ఎల్లయ్య సులోచన, పవర్‌లూం కార్మికులు



ఇంట్లోనే మరమగ్గాలు ఏర్పాటు చేసుకున్నాం. నా భార్య బీడీలు చుట్టేది. బీడి పని తగ్గిపోవడంతో ఇంట్లో నాతో పాటు పవర్‌లూంలు నడపడం నేర్చుకుంది. ఇద్దరం కలిసి పని చేసుకుంటున్నాం. ఇప్పుడు చేతి నిండా ఇద్దరికి పని ఉంది. రూ.25వేల వరకు సంపాదించుకోగలుతున్నాం.

పనులు మాత్రం పుష్కలంగా ఉన్నాయి..

- శ్రీనివాస్, వార్పిన్ కార్మికుడు



మరమగ్గాలకు బీములు అందించే వార్పిన్ పనిలో రిస్కు ఉంది. ప్రభుత్వం అందిస్తున్న ఉత్పత్తి వల్ల రూ.5 వేల వరకు అదనంగా సంపాదించుకోగలుగుతున్నాం. గతం లో రూ.10 వేలు వచ్చేవి. వారంలో నాలుగు రోజులు పని ఉండేది. ఇప్పుడు నిరంతరం పని ఉంటుంది. రూ.15వేల వరకు వస్తోంది.

అధికారుల అవినీతిపై వాట్సాప్ వీడియో వైరల్

● కాసులిస్తేనే మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారి

ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు పేదలకు ఉపయోగకరంగా ఉన్నా అమలులో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే పేదలకు ఆసరాగా ఉండాలని ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, పథకాల కింద దరఖాస్తులు చేసుకొని డబ్బులు అందక నానా తిప్పలు పడుతుంటే మరోవైపు సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది మాత్రం కాసులిస్తేనే మ్యారేజ్ సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ డబ్బులు వసూలు చేస్తున్న తీరును బాధితులే వీడియోలు తీసి వాట్సప్ గ్రూప్‌ల్లో పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సిరిసిల్ల, ముస్తాబాద్, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల నుంచి నిత్యం వివిధ రిజిస్ట్రేషన్‌ల కోసం జనం వస్తూ పోతున్నారు. భూముల రిజిస్ట్రేషన్‌లో మామూళ్లు చేతులు మారడం పరిపాటిగానే మారినా చివరకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద దరఖా స్తు చేసుకోవడానికి మ్యారేజ్ సర్టిఫికేట్‌కు కూడా వసూళ్లకు దిగడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే అన్నీ సక్రమంగా ఉన్నా.. రూ.500ల నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.. మ్యారేజ్ సర్టిఫికెట్‌లకు ఆన్‌లైన్ సిస్టమ్ లేకపోవడంతో మ్యానువల్ సిస్టమ్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం రూ.200 వరకు రిజిస్ట్రేషన్ ఫీజు ఉన్నా దానికి సంబంధించిన రసీదులు ఇవ్వడం లేదు. మరోవైపు రిటైర్డ్ ఉద్యోగులతో పనులు చేయించుకుంటూ వసూళ్లకు తెరలేపుతున్నారనే విమర్శలున్నాయి. ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, జనన ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్ తేవడం మర్చిపోతే మాత్రం రూ.వెయ్యి నుంచి 1200ల వరకు వసూలు చేస్తున్నట్లు కల్యాణలక్ష్మీ లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇటీవల రూ.51 వేల నుంచి రూ.75116లకు కల్యాణలక్ష్మీ డబ్బులు పెంచడంతో పేద వర్గాలు కొంత కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతాయని దరఖాస్తు చేస్తున్నారు. కానీ అవి మామూళ్లకే సరిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది మాత్రం తాము ఎలాంటి డబ్బులు వసూలు చేయడం లేదని వాదించడం విశేషం.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని

అధికారికంగా నిర్వహించాలి

ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని.. తెలంగాణ ఉద్యమ సమయంలో డిమాండ్ చేసిన వాళ్ల నోళ్లు ఎందుకు మెదపడం లేదో స్పష్టం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1నుంచి 7వరకు బీజేపీ రాష్ట్రవ్యాప్త పర్యటనను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 4న సిరిసిల్లలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా సెప్టెంబర్ 17న స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలన్నారు. 2019లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారికంగా నిర్వహిస్తామన్నారు. నేరెళ్ళ ఘటనలో దళితులపై అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేసిన ఎస్పీని పోలీసుల సంస్మరణకు లడఖ్‌కు పంపించడం శోచనీయమన్నారు. నేరెళ్ళ ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అభిప్రాయ సేకరణ వారి పార్టీ కార్యకర్తలతోనే చేశారని.. రైతులు, ప్రజలకు అవకాశం లేదన్నారు. ఈ సమావేశంలో మహిళ మోర్చా అధ్యక్షురాలు ఆకుల విజయ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులు ఆడెపు రవీందర్, రేగుల మల్లికార్జున్, మహిళ అధ్యక్షురాలు గడ్డం లత, భీమవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

● శంషాబాద్ విమానాశ్రయం నుంచి గన్నేరువరం వస్తుండగా ఘటన ● మరో ఇద్దరికి తీవ్రగాయాలు

గన్నేరువరం: కొండపాక శివారు మల్లన్న గుట్ట సమీపంలోని రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గన్నేరువరానికి చెందిన బత్తిని శేఖర్(23) సౌదీలో ఉండి, ఆదివారం స్వగ్రామానికి తిరిగివస్తున్నాడు. శేఖర్‌ను శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదివారం తెల్లవారుజామున గన్నేరువరానికే చెందిన కూన సంతోష్(27)కారులో తీసుకుని తండ్రి సమ్మయ్య, అన్నయ్య రమేశ్(28)లు బయలుదేరారు. వారితో సంతోష్ స్నేహితుడైన చొక్కారావుపేటకు చెందిన మహంకాళి అనిల్(28) కూడా ఉన్నాడు. అయితే కొండపాక శివారులో చేరుకున్నారు. అక్కడ ఇనుప చువ్వల లోడుతో ఆగి ఉన్న ట్రాయిలర్‌కు కారు ఢీ కొట్టి లారీ కిందకు దూసుకెళ్లింది. లారీని వెనుకనుంచి ఢీకొట్టగా కారు ముందు సీటులో కూర్చున్న అనిల్, వెనుక సీటులో కూర్చున్న రమేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ సంతోష్, శేఖర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన వారిని 108 అంబులెన్స్ సిబ్బంది, కుకునూర్‌పల్లి పోలీసులు, టోల్‌గేట్ సిబ్బంది బయటకు తీశారు. గాయపడిన వారిని సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.




కారులో మృతదేహాలు , రమేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మరణంలోనూ వీడని స్నేహం

కారులో వెళ్లిన మాంకాళి అనిల్, బత్తిని రమేశ్, కూన సంతోష్‌లు ప్రాణ స్నేహితులు. మృతిచెందిన బత్తిని రాయమల్లు ఏడాదిన్నర క్రితం కొత్తపల్లికి చెందిన సరితతో వివాహం జరిగింది. మృతుడు బత్తిని రాయమల్లు ఒడ్డెర పని చేసుకుంటూ బండలు జీవనోపాధి పొందుతుండగా సౌదీ నుంచి వచ్చిన తమ్ముడు బత్తిని రాజశేఖర్(23) గన్నేరువరంకు తన స్నేహితులు కూన సంతోష్, మాంకాళి అనిల్‌తో కలిసి కారులో వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది.

మృతుడు మాంకాళి అనిల్ చొక్కారావుపల్లి గ్రామానికి చెందిన మాంకాళి మల్లయ్య, మల్లవ్వ పెద్దకుమారుడు. అనిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. చొక్కారావుపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

ఆరుగురి పేకాట రాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం : కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో ఒక ఇంటిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం జ్యోతినగర్‌లోని ఇంటిపై దాడి చేయగా ఆరుగురు పట్టుబడ్డారు.

ఇందులో కొలాడి బాలకిషన్‌రావు, అయిల్నేని రామారావు, చెన్నమనేని రాంమోహన్, శివప్రసాద్, జువ్వాడి రవీందర్‌రావు, జువ్వాడి వెంకట్‌రావులు ఉన్నారు. పట్టుబడిన ఆరుగురి వద్ద నుంచి 39,660 రూపాయల నగదు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రెండవ ఠాణా పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగిత్యాలలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు



బాస్కెట్ బాల్ అడుతున్న విద్యార్థులు

జగిత్యాల అర్బన్ : జగిత్యాలలో సెప్టెంబర్ 9,10 తేదిల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు బాస్కెట్ బాల్ అసోషియేషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక నిర్వహించినట్లు బాస్కెట్ బాల్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బి.ఆనంతరెడ్డి తెలిపారు. ఇందులో మొత్తం 46 మంది బాలురు, 30 మంది బాలికలు పాల్గొనగా, ఇందులోంచి బాలబాలికల విభాగాల్లో 12 మంది , నలుగురు స్టాండ్‌బై కోసం చొప్పున మొత్తం 16 మంది క్రీడాకారులను వేరు వేరుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు పి.విశ్వప్రసాద్, జి.నిరంజన్, కె.రవికుమార్, జి.శ్రీధర్‌రావు, పి.కృష్ణప్రసాద్, అజయ్, ప్రేమ్, సాగర్, వేణు, సుధాకర్, ప్రశాంత్, సామంత్, సతీష్, సుమిత్ సామ్రాట్, మంగ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో రౌడీ షీటర్ దారుణ హత్య

● ఇంట్లో నరికి చంపిన దుండగులు ● భూవివాదంలో తలదూర్చడమే కారణమా?



మృతుడి భార్య నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ



హత్యకు గురైన బుగ్గల శ్రీనివాస్

గోదావరిఖని: గోదావరిఖని ఉదయ్‌నగర్‌లో ఆదివారం ఉదయం రౌడీషీటర్ అరుకోళ్ల శ్రీనివాస్ అలియాస్ బుగ్గల శ్రీనివాస్(45) దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు ఇంట్లోకి చొరబడి కత్తులతో నరికి చంపారు. అడ్డువచ్చిన అతని భార్య అంజలిపై సైతం దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆమె చేతికి తీవ్ర గాయమైంది. ఘటనకు సంబంధించి మృతుడి భార్య అంజలి తెలిపిన వివరాలు...

అరుకోళ్ల శ్రీనివాస్ కుటుంబం కొంత కాలంగా ఉదయ్‌నగర్‌లోని సింగరేణి క్వార్టర్‌లో నివాసముంటుంది. ఆదివారం ఉదయం శ్రీనివాస్, అతని భార్య మాట్లాడుకుంటుండగా పాత నేరస్థుడు పెద్ది రవిశంకర్ లోనికి వచ్చి శ్రీనివాస్‌ను పలుకరించాడు. అతడు కనబడకుండా కత్తిపెట్టుకోవడం గమనించిన శ్రీనివాస్ భార్య అంజలి అతన్ని అడ్డుకుంది. దీంతో అతడు మొదట ఆమెపై దాడి చేశాడు. ఆమె భయంతో పరుగులు తీసింది. వెంటనే శ్రీనివాస్‌పై దాడి చేశాడు. బయట ఉన్న మరో ఐదుగురు వ్యక్తులు లోనికి చొరబడి శ్రీనివాస్ తల, మెడను నరికారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆటోలో పరారయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఉదయ్‌నగర్ ప్రధానరహదారి పక్కనే ఉన్న క్వార్టర్‌లోనే ఈ ఘటన చోటు చేసుకున్నది. అంజలి అరుపులతో జనం పెద్ద ఎత్తున పోగయ్యారు. రామగుండం సీపీ విక్రమ్‌జీత్‌దుగ్గల్, డీసీపీ విజేందర్‌రెడ్డి, ఏసీపీ అపూర్వరావు, వన్‌టౌన్ సీఐ గజ్జి కృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బుగ్గల శ్రీనివాస్ పలు హత్య కేసుల్లో నిందితుడు

మృతుడు బుగ్గల శ్రీనివాస్ గోదావరిఖని ప్రాంతాల్లో జరిగిన పలు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ ఎర్రగోళ్ల రమేష్ హత్య కేసులో ప్రధాన నిందితుడు. ఈ కేసులో శ్రీనుకు సహకరించారని పోలీసు అధికారులైన రాజేంద్రప్రసాద్, విద్యాసాగర్‌లపై కూడా సీబీసీఐడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. ఇదే కాకుండా గంగానగర్‌లో జరిగిన అంతర్గాం సర్పంచ్ చింతల ప్రశాంత్, జీఎం కాలనీలోని జరిగిన పుట్ట శారద హత్య కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నారు. కానిస్టేబుల్ రమేష్ మరణంపై విచారణ జరిపిన పోలీస్ ప్రత్యేక బృందం చింతల ప్రశాంత్, పుట్ట శారద హత్య కేసుల్లో కూడా శ్రీనివాస్ ప్రమేయం ఉన్నట్టు గుర్తించింది. ఆ కేసుల్లో నిందితుడిగా చేర్చారు. అనంతరం అతనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు.

భూ వివాదాల్లో జోక్యమే హత్యకు కారణమా...

బుగ్గల శ్రీనివాస్ ఒక దినపత్రికలో పాత్రికేయుడిగా పని చేస్తున్నాడు. పలువివాదాల సెటిల్‌మెంట్లలో తలదూర్చినట్టు ప్రచారం జరుగుతుంది. మంచిర్యాలకు సంబంధించి ఒక భూవివాదంలో తలదూర్చడం వల్లే హత్యకు దారితీసినట్టు తెలుస్తున్నది. స్థానిక ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి మంచిర్యాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడని, గోదావరిఖనిలో ఒక వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించే విషయంలో వివాదం చోటు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ వివాదంలో జోక్యం చేసుకున్న బుగ్గల శ్రీనివాస్ పలుమార్లు చర్చించినట్టు తెలుస్తున్నది. ఈ విషయంలో విభేదించిన ప్రశాంత్‌నగర్‌కు చెందిన వ్యక్తితో పాటు మరికొందరు బుగ్గల శ్రీనివాస్ హత్యకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని భార్య అంజలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు పెద్ది రవిశంకర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గంగాధర : గంగాధర మండల కేంద్రంలో శనివారం రాత్రి తాపీ మేస్త్రీ పని చేసే రాజ్‌కుమార్ (45) అనే వ్యక్తి క్రిమిసంహార మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై స్వరూప్ రాజ్ చెప్పారు. కుటుంబ కలహాలు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూమార్తె ఉన్నారని ఎస్సై వివరించారు.

పచ్చునూర్‌లో పేకాటరాయుళ్ళ అరెస్టు

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఆదివారం 9 మందిపేకాటరాయుళ్ళను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పచ్చునూర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 9 మంది పేకాటరాయుళ్ళతో పాటు రూ. 16325 నగదు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడిలో చొరబడిన ఎలుగుబంటి

సుల్తానాబాద్: మండలంలోని కనుకుల గ్రామపంచాయతీ పరిధిలోని రాములపల్లిలో శ్రీరామాలయంలో శనివారం రాత్రి ఎలుగుబంటి రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. గణపతి నవరాత్రులు కావడంతో భక్తులు పూజలు చేస్తుండగా సమీపంలోని గుట్టల నుంచి బల్లూకం గ్రామంలోకి వచ్చి ఆలయంలోని నవగ్రహాల మందిరంలోకి చొరబడింది. యువకులు ధైర్యం చేసి తలుపులు వేసి గడియ పెట్టారు. గ్రామస్థులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజు, అటవీశాఖ అధికారులు వచ్చి ఎలుగుబంటిని పట్టుకోవడంతో గ్రామస్థులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



చెట్టును ఢీకొన్న కారు

వేములవాడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మండలం ఫాజుల్‌నగర్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైద్రాబాద్‌కు చెందిన ఓ కుటుంబం దైవదర్శనానికి ధర్మపురికి వెళ్లి శ్రీ లక్ష్మీనృసింహాస్వామి వారిని దర్శించుకుని తిరిగి వేములవాడకు శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తూ ఫాజుల్‌నగర్ గ్రామంలో మూలమలుపు వద్ద ప్రమాదశాత్తు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో భాగ్యలక్ష్మి, వెంకట్, సురేఖలకు వెన్నుముకకు గాయాలు కాగా హన్మాండ్లకు కాలు విరిగి త్రీగాయాలైనట్లు తెలిపారు. స్థానికులు వెంటనే 108కి సమచారం అందించడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొని యువకుడి మృతి

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎరడపల్లి గ్రామ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఇదే గ్రామానికి చెందిన దూడం రాజమౌళి (35) అనే యువకుడు ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో రాజమౌళి రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. రాజమౌళిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆటోలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ ఎల్ శ్రీను తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, గుర్తు తెలియని ట్రాక్టర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లగొండలో వ్యక్తి ఆత్మహత్య

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన కూన కొమురయ్య(49) ఆదివారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తెలిపారు. వ్యవసాయ పొలం వద్దకు వెల్లి విషం తాగి మృతి చెందటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. మృతునికి భార్య భాగ్యలక్ష్మీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన స్థలం వద్ద విషం డబ్బ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కారణాలు తెలియరాలేదు.

'రైతు దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి'

ఎల్లారెడ్డిపేట: రైతు దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మ నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేటలో బలరాముడి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం దేశానికి అన్నం పెట్టే రైతు దినోత్సవాన్ని టీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండారి బాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోగురి శ్రీనివాస్‌రెడ్డి, దొమ్మటి నర్సయ్య, బంగ్లా బాల్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- విరిగిన విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని సెస్ అధికారులు
- భయాందోళనలో ప్రజలు

సిరిసిల్ల రూరల్ : మండలంలోని పెద్దూరు శివారు దుప్యా తండాలో విద్యుత్ స్తంభాలు విరిగి ప్రమాదకరంగా ఉన్న సెస్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు నిత్యం భయంతో వణికిపోతున్నారు. దుప్యా తండా ఎదుట 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మిస్తున్న సమయంలో స్తంభాలు పడి తండాలో ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. స్తంభాలు వంగి విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చేయడంతో స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు విరిగిపోయిన మూడు స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను వేయాలని సూచించారు. డబ్బులు చెల్లించి ఆరు నెలలు గడుస్తున్నా సెస్ అధికారులు వాటి స్థానాల్లో కొత్త స్తంభాలను వేయడం లేదని ప్రజలు ఆరోపించారు. మూడు రోజుల క్రితం గాలిదుమారంతో విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. తండాలో రెండు రోజుల పాటు కరెంట్ అంతరాయం ఏర్పడింది. స్తంభాలను మార్చి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


దుప్యానాయక్ తండాలో విరిగిన స్తంభాలు

విరిగిపోయిన స్తంభాలతో అవస్థలు పడుతున్నాం
- భూక్య రెడ్డినాయక్ దుప్యా తండా పెద్దూరు



దుప్యా తండాలో విరిగిన స్తంభాలతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. సెస్ అధికారులు పట్టించుకోకపోవడంతో గాలి వస్తే విద్యుత్ వైర్లు అంటుకొని మంటలు ఏర్పడుతున్నాయి. కొత్త స్తంభాల కోసం ట్రాన్స్‌కో అధికారులకు సెస్‌కు డబ్బులు చెల్లించిన సెస్ అధికారులు పట్టించుకోవడం లేదు. సెస్ చైర్మన్ స్పందించి విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను వేయించి సమస్యను పరిష్కరించాలి.

విరిగిన స్తంభాలను త్వరలోనే తొలగిస్తాం
- నాంపెల్లి గుట్ట సెస్ ఎండీ సిరిసిల్ల



పెద్దూరు శివారులోని దుప్యా తండాలో విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను త్వరలోనే ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తా. సిరిసిల్ల పట్టణంలో రోడ్డు వెడల్పులో భాగంగా విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు కొనసాగుతున్నందున గ్రామాల్లో చేపట్టే పనులలో ఆలస్యం జరుగుతోంది.

నిమజ్జనానికి అదనపు పోలీస్ బలగాలు

తంగళ్లపల్లి: వినాయక నిమజ్జనానికి అదనపు పోలీస్ బలగాలు ఆదివారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో పాటు మరో పది మందిని వినాయక నిమజ్జన బందోబస్తు కోసం పంపించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనం చేపట్టాలని సూచించారు.

నిమజ్జన ఊరేగింపులో జాగ్రత్తలు, సూచనలు పాటించాలి

- సిరిసిల్ల టౌన్ సీఐ శ్రీనివాసరావు

సిరిసిల్ల రూరల్: వినాయక నిమజ్జన ఊరేగింపులో నిర్వాహకులు జాగ్రత్తలు, సూచనలను పాటించాలని సిరిసిల్ల టౌన్ సీఐ శ్రీనివాసరావు కోరారు. సిరిసిల్లలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు ఊరేగింపు కోసం ముందస్తుగా వాహనాలను సమకూర్చుకొని వాటి సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌లో అందించాలని అన్నారు. ఊరేగింపు సమయంలో వాహనాలకు ఎలాంటి సౌండ్ బాక్సులు అమర్చుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు శేఖర్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న వినాయకుడు


నాగంపేటలో పూజలు అందుకుంటున్న వినాయకుడు

గంభీరావుపేట : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా గణనాథులకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గ్రామాల్లో వాడ వాడలా వెలసిన వినాయక మండపాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

గురుకులంలో...

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు వినాయకుడి మట్టి విగ్రహాలు తయారు చేసి పూజలు నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేశారు. కూరగాయలతో విగ్రహాన్ని తయారు చేసి పాడవకుండా వాటర్ బాటిల్‌లో పెట్టి పూజలు చేస్తున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు వినాయకలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.


గురుకుల పాఠశాలలో పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

బీఎస్పీ జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల టౌన్ : బహుజన సమాజ్ పార్టీ పునర్ నిర్మాణంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గం నియమాకం జరిగింది. ఆదివారం బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మందపురం బాలయ్య రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా చందనగిరి గోపాల్, ప్రధాన కార్యదర్శిగా చాకలి రమేష్, ఉపాధ్యక్షుడిగా లింగంపెల్లి లక్ష్మణ్, కార్యదర్శిగా లింగంపెల్లి మధుకర్, కోశాధికారిగా మహ్మద్‌అబ్దుల్‌నబీ, సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా జగ్గం నరేష్, జిల్లా ఇన్‌చార్జీలుగా వరదవెల్లి స్వామిగౌడ్, దొబ్బల నరేష్, రాష్ట్ర కార్యదర్శులుగా అంకని భాను, మల్యాల రమేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ బీఎస్పీని జిల్లాలో మరింత బలోపేతం చేయడానికి కృషిచేస్తామని రాజ్యాధికారం దిశగా బహుజనులను ఏకం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే నం.1గా కరీంనగర్ డెయిరీ

- కరీంనగర్ జిల్లా డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు

ముస్తాబాద్ : తెలంగాణాలోనే నెంబర్‌వన్‌గా కరీంనగర్ డెయిరీని నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు కరీంనగర్ జిల్లా డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని గూడూరు బల్కింగ్ కేంద్రం వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లను అందించారు. డెయిరీ ద్వారా పాల ఉత్పత్తిదారుల కుటుంబాలకు పుస్తెమట్టెలను ప్రతి యేటా అందిస్తున్నట్లు తెలిపారు. రోజు రోజుకు డెయిరీని విస్తరింపజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రం మొదలు హైదరాబాద్ వరకు నాణ్యతతో కూడిన స్వీట్లు, పాలు, పెరుగును సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఆమ్ ఆద్మీ చెక్కులను అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో 5 లక్షల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. అంబులెన్స్ ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పాలఉత్పత్తిదారులకు అండగా ఉంటూ వారి ప్రయోజనాలకు డెయిరీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఉత్పత్తిదారుల భాగస్వామ్యంతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కనమేని ప్రసాద్‌రెడ్డి, చైర్మన్‌లు చర్లపల్లి సుధాకర్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు చెక్కులను అందిస్తున్న రాజేశ్వర్‌రావు

బాసర టూ....శబరిమలై

- మానేరు నిండాలని మహాపాదయాత్ర
- 14 మంది అయ్యప్ప భక్తులతో రాజుగురు స్వామి బృందం

ముస్తాబాద్ : స్వామి శరణు ఘోషతో అయ్యప్ప భక్తులు రాజు గురుస్వామి ఆధ్వర్యంలో మహాపాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ముస్తాబాద్‌కు చెందిన శానిత్స్వరూపులు రాజు గురుస్వామి, ఈనెల 14న బాసర నుంచి బయలుదేరారు. గురుస్వామితో 14మంది భక్తులు వెంట ఉన్నారు. ఆదివారం ముస్తాబాద్‌కు చేరుకొని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పకు పంచామృతాభిషేకం చేశారు. రాజుగురుస్వామి చేస్తున్న పాదయాత్ర ఇది 10వసారి. ఈ పూజల్లో విండో చైర్మన్ చక్రధర్‌రెడ్డి, గూడెపు దేవేందర్, సంతోష్, గోపిశెట్టి సంతోష్, జగన్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


రాజుగురుస్వామి, అయ్యప్ప భక్తులు

లగిశెట్టి ట్రస్టును సందర్శించిన గ్రంథాలయ రాష్ట్ర చైర్మన్


వృద్ధులతో మాట్లాడుతున్న శ్రీధర్

తంగళ్లపల్లి: మండలంలోని లగిశెట్టి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్టును తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శ్రీధర్ ఆదివారం సందర్శించారు. ట్రస్టులో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ట్రస్టు నిర్వాహకుడు సెస్ వైస్ చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ ఆయనకు వివరించారు. వృద్ధులకు ఆశ్రయం కల్పించడంతో సామాజిక కార్యక్రమాలను చేస్తున్న శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. అలాగే వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు.

నేడు కలెక్టరేట్ ఎదుట కేజీబీవీల ధర్నా

ధర్నా కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్ : కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని టీపీస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పకాల శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో కేజీబీవీల సమావేశంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా కరపత్రాన్ని శంకర్‌గౌడ్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ సంవత్సరాల కాలంగా వేతనాలు పెంచాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని అనేక రూపాల్లో కేజీబీవీలు పోరాటాలు చేస్తున్నారని అన్నారు. విద్యాశాఖ రేపుమాపు అని కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీఎంపీఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి సురేష్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేజీబీవి టీచర్‌లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్‌లో ఎదుట నిర్వహంచతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పరకాల రవీందర్, ఆశాజ్యోతి, హైమావతి, చెవుల బాలవ్వ, రంజాన్ నర్సవ్వ, తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శంకర్

ఆంధ్రజ్యోతి
5
వేములవాడ
సోమవారం 28 ఆగస్టు 2017
వేములవాడ, వేములవాడ రూరల్, చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి, కోనరావుపేట

'రజకులను ఎస్సీలోకి చేర్చాలి'

కోనరావుపేట: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేంతవరకు పాదయాత్రను కొనసాగిస్తామని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మీ అన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని చేస్తున్న పాదయాత్ర ఆదివారం కోనరావుపేటకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 57 రోజులుగా ఈ పాదయాత్రను కొనసాగిస్తున్నామన్నారు. సుమారు 2వేల కిలోమీటర్ల పాదయాత్ర 57రోజుల్లో కొనసాగించామన్నారు. తెలంగాణ ఉద్యమం జరిగిన విధంగానే రజకులు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో రజక నాయకులు లింబయ్య, చెక్కపల్లి చంద్రయ్య, జింక వెంకటి, నారాయణ, గంగాదర్, కిష్టయ్య, తిరుపతి, లచ్చయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పేరుకుపోయిన పారిశుధ్యం




అనుపురంలో 9వ వార్డులో బురదమయంగా ఉన్న రహదారి, తిప్పాపూర్‌లో రోడ్డు మీదనే పారుతున్న మురుగునీరు

- వర్షాకాలం కాలనీలు బురద మయం
- అధ్వానంగా మారిన ముంపు గ్రామాలు
- జ్వరాల బారిన పడుతున్న ప్రజలు

వేములవాడ టౌన్: గ్రామాల్లో పారిశుధ్యం పేరుకుపోయి అధ్వానంగా మారిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మండలం తిప్పాపూర్, నాంపెల్లి, వెంకటంపల్లి, బాలరాజుపల్లి, నూకలమర్రి, వట్టెంల ముంపు గ్రామాలైన రుద్రవరం, కొడుముంజ, అనుపురం, సంకెపెల్లి గ్రామాల్లో చిన్నపాటి వర్షం పడిన కాలనీల్లో వున్న రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. నీరు నిల్వగా ఉండటంతో దోమలు వృద్ధిచెంది ప్రజలు వ్యాధుల బారినపడే ఆవకాశాలు వున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేములవాడ మండలం అనుపురం గ్రామం ముంపుకు గురికావడంతో కొన్నేళ్లుగా గ్రామాల్లోని రోడ్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాలు సందర్శించి పారిశుధ్య నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వేములవాడ మండలం వెంకటటాంపెల్లి గ్రామంలో ప్రజలు జ్వరాల బారినపడ్డారు. గ్రామంలో ఇంటికి ఒక్కరు జ్వరంతో బాధపడుతున్నారు. వేములవాడ వైద్యాధికారులు గ్రామాన్ని సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన మాత్రలు అందజేసారు.

అధ్వానంగా ముంపు గ్రామాల బ్రతుకులు

వేములవాడ మండలంలోని సంకెపెల్లి, ఆరెపెల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. అనుపురం గ్రామంలో ఇప్పటి వరకు పూర్తి స్థాయి నష్టపరిహారం అందకపోవడంతో గ్రామస్థులు గ్రామాన్ని ఖాళీ చేయలేదు. గ్రామంలో కనీస మౌలిక వసతులు కూడా కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాన్ని ఖాళీ చేసేంతవరకైన గ్రామాల్లో పారిశుధ్యం కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో రోడ్లన్ని బురద మయంగా మారి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. అనుపురం గ్రామంలోని 9వ వార్డులో చిట్లవాడలో రోడ్డు బురదమయంగా మారి నీరు నిల్వడంతో దోమలు వృద్ది చెంది అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు వాపోతున్నారు. ముంపు గ్రామం కావడంతో గ్రామానికి అభివృద్ది పనులకు నిధులు రావడం లేదని సర్పంచ్ కాలం వెళ్లదీస్తున్నడని చెబుతున్నారు. గ్రామపంచాయతీ నుంచి కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని వాపోతున్నారు. గ్రామాన్ని విడిచి వెళ్లేంత వరకు తాత్కాలికంగా మొరం పోయాలని కోరుతున్నారు. కొడుముంజ గ్రామంలో కూడా ఇదే పరిస్థితి ఉంది.

దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి

- ఆలూరి మమత, తిప్పాపూరం



తిప్పాపూరం గ్రామంలో పారిశుధ్యంపై పట్టింపు లేదు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో డ్రైనేజీ లేకపోవడంతో ఇండ్లల్లో నుంచి వచ్చిన వృధానీరు రోడ్డు మీదనే పారుతుంది. దీంతో చుట్టుపక్కల వున్న వారు జ్వరాల బారినపడే అవకాశం ఉంది. గ్రామపంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లితే దోమల బారిన పడకుండా ఉంటారు. పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చర్యలు చేపట్టాలి.

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు

- పలుచోట్ల అన్నదానాలు



గాంధీనగర్ శివసేన యూత్ గణపతి వద్ద పూజలో పాల్గొన్న మహిళలు

వేములవాడ: గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేములవాడ పట్టణంలో కొలువుదీరిన బొజ్జ గణపయ్య ప్రత్యేక పూజలందుకుంటున్నాడు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో ప్రతిష్ఠించిన గణపయ్యకు అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్ అయిన శ్రీలక్ష్మీగణపతిస్వామివారికి అభిషేకం, శ్రీరాజరాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి నైవేద్యాలను సమర్పిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆంధ్రాబ్యాంకు కూడలిలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి వద్ద, గాంధీనగర్‌లో అంజనీయూత్ గణపతి వద్ద, సుభాష్‌నగర్‌లో అన్నదానం నిర్వహించారు. గాంధీనగర్ శివసేన యూత్ వద్ద పంచామృతాభిషేకం నిర్వహించారు.

రుద్రంగిలో..

రుద్రంగి: మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద ప్రతిష్టించిన గణేష్ విగ్రహం వద్ద హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ అధ్యక్షుడు మాడిశెట్టి అభిలాష్, యూత్‌సభ్యులు గగన్, శ్రీకాంత్, సందీప్, కిషోర్, వెంకటేష్, మహిపాల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలి'

వేములవాడ: సేవా కార్యక్రమాలపై దృష్టిసారించాలని లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ గోగికార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడలో జరిగిన లయన్స్ క్లబ్ రీజినల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీజియన్ పరిధిలోని లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మీజిల్స్ రుబెల్లా టీకా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నాగుల సంతోష్, కొమురవెల్లి శ్రీనివాస్, టి. వెంకటరెడ్డి, పి.నాగరాజు, లక్ష్మీకాంతం, తీగల వెంకటేశ్వర్‌రావు, నిజాం నరేందర్, మారం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

రుద్రంగి: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని రుద్రంగి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆదివారం చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ తిపిరెడ్డి వెంకటరెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు, అంబాటి శంకర్, చెలుకల తిరుపతి, హరినాథ్‌రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నెమలి లభ్యం..

బోయినపల్లి: వరదవెల్లి గ్రామంలో నెమలి లభ్యమైంది. ఆదివారం గ్రామంలోని ఊరవాగు నీటిలో తడిసి కదలగుండా ఉండిపోయింది. గమనించిన గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా బీట్ ఆఫీసర్ పూర్ణిమ నెమలిని తీసుకొని కరీంనగర్ డీర్‌పార్క్‌కు తరలించారు. నెమలిని అప్పగించిన వారిలో సర్పంచ్ నాగుల వసంత, గ్రామస్తులు గొట్టె వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, హనుమంతరావు, రాజనర్సయ్య, కొమురయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

స్తంభం సపోర్ట్ వైర్‌కు విద్యుత్ సరఫరా

- భయాందోళనలో కాలనీవాసులు

చందుర్తి: మండలంలోని ఎన్గల్ గ్రామంలోని ప్రధాన రహదారిలో గల విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. బస్టాండ్ సమీపంలోని రాజేశం అనే వ్యక్తి ఇంటిపక్కన ఉన్న పోల్‌కు 5రోజుల నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం రెండు ఎడ్లు విద్యుత్ షాక్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సెస్ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరా జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నాన్న చిరకాల వాంఛ నెరవేరనుంది

- వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు



భద్రత ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కోనరావుపేట: మరికొద్ది రోజుల్లో నాన్న చెన్నమనేని రాజేశ్వర్‌రావు ఎత్తిపోతల చిరకాల వాంఛ త్వరలో నెరవేరనుందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో సెప్టెంబర్ 2న నిర్వహించనున్న మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు సభా ఏర్పాట్లను చెన్నమనేని రమేష్‌బాబు, జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, డీఎస్పీ చంద్రశేఖర్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టుతో మండలానికి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించే పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. ఈ పనులు మరికొద్ది రోజుల్లో పూర్తికానున్నాయన్నారు. దీంతో నాన్నగారి 50 ఏండ్ల చిరకాల వాంఛ నెరవేరనుందని అన్నారు. వచ్చేనెల 2న నిర్వహించే బహిరంగ సభకు మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పాల్గొని పలు అభివృద్ది పనులను ఆయన ప్రారంభిస్తారన్నారు. ఈ సభను సిరిసిల్ల జిల్లా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. వేములవాడ డీఎస్పీ అవదాని చంద్రశేఖర్, వేములవాడ టౌన్, రూరల్ సీఐలు మాధవి, శ్రీనివాస్, సిరిసిల్ల ఎస్ఐ శ్రీనివాస్‌రావు, కోనరావుపేట ఎస్ఐ రమేష్ సభా భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంకినేని లక్ష్మీ, జడ్పీ సభ్యురాలు పల్లం అన్నపూర్ణ, సర్పంచ్ గోపాడి జ్యోతి, సురేందర్‌రావు, సెస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చంద్రయ్య, సెస్ డైరెక్టర్‌లు దేవరకొండ తిరుపతి, అల్లాడి రమేష్, వేములవాడ చైర్‌పర్సన్ నామాల ఉమా, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

చందుర్తి: మండల కేంద్రంలో గడిచిన ఏడాది హరితహారంలో భాగంగా గ్రామశివారులో నాటిన టేకు, ఈత మొక్కలను ధ్వంసంచేసిన భూ ఆక్రమణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజాప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. గత హరితహరంలో భాగంగా ఎంపీపీ తిప్పని శ్రీనివాస్, సెస్‌డైరెక్టర్ అల్లాడి రమేష్, సర్పంచ్ గొట్టె ప్రభాకర్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎక్సైజ్ అధికారులు మొక్కలను నాటారు. ఇటీవల ఓ భూ ఆక్రమణదారుడు మొక్కలను ధ్వంసం చేశారని పోలీసు లకు, రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినప్పటికి పట్టించుకోవడం లేదని వారు ఎమ్మెల్యేతో వాపోయా రు. జిల్లాస్థాయి అధికారులతో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీపీ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ అల్లాడి రమేష్, సర్పంచ్ గొట్టె ప్రభాకర్, ఉత్తర తెలంగాణ గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంపునూరి మల్లేశం గౌడ్, గ్రామశాఖ అధ్యక్షులు పులి గంగాధర్, నాయకులు కత్తి తిరుపతి, బాలవేని మల్లయ్య, పర్శరాములు, శ్రీనివాస్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

చందుర్తి: సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు తాటికొండ సంజీవ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28న జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం వరకు జరిగే మహా ర్యాలీలో జిల్లాలోని ఉపాధ్యాయులు ఐక్యతతో కదిలివచ్చి పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దయ్యేవరకు పోరాటం కొనసాగించాలన్నారు. ఈ సమావే శంలో ప్రధాన కార్యదర్శి గుమ్మడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్స్ అఫ్ హోక్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు

బోయినపల్లి: మండల కేంద్రంలో సామాజిక కార్యక్రమాలను చేపట్టేందుకు హ్యాండ్సఫ్ స్వచ్ఛంద సంస్థను కొంతమంది యువకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే కాకుండా తమ సంస్థ ద్వారా రక్తదానాన్ని కూడా అందిస్తామన్నారు. హ్యాండ్స్ అఫ్ హోక్ సేవా సంస్థ అధ్యక్షు డిగా దుబ్బాక మహేష్, ఉపాధ్యక్షుడిగా చౌదరి శ్రీధర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్ ప్రసాద్, కోశాధికారిగా మొగులోజు శ్రీకాంత్‌చారి నియామకమయ్యారు.

మహార్యాలీని విజయవంతం చేయాలి

వేములవాడ టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని నేడు నిర్వహించనున్న మహార్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ టీచర్స్ పెడరేషన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వేములవాడ మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వరకు నిర్వహించే ర్యాలీలో పెద్దసంఖ్యలో ఉపాధ్యా యులు పాల్గొనాలని కోరారు.

'కాళేశ్వరం' పై ప్రజాభిప్రాయ సేకరణ డ్రామా

● దమ్ముంటే ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలి ● జడ్పీ సమావేశంలో మెడికల్ కళాశాలపై తీర్మాణం చేయాలి
● టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్ : కాళేశ్వరం ప్రాజెక్టు శంఖుస్థాపన చేసి 17 నెలలు గడిచిన తరువాత ప్రజాభిప్రాయ సేకరణ ఏ విధంగా చేస్తారని, ప్రజలను మబ్యపెట్టడానికి సీఎం కేసీఆర్ డ్రామా చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆయన ఆదివారం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యావరణ అనుమతులు లేకుండా భూసేకరణ, ప్రాజెక్టు పనులు ఏ విధంగా ప్రారంభించారని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రెండేళ్లలో నీరందిస్తానని చెప్పిన కేసీఆర్ 2016 మే 1న శంఖుస్థాపన చేసి ఆగస్టు 24న మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నాడని, ఆగస్టు 26న మంత్రి హరీష్‌రావు అధికారులతో సమీక్ష జరిపి వచ్చే ఏడాది నీరిస్తామని చెప్పారని, ఇదంతా జరిగిన ఏడాదిన్నర తరువాత పర్యావరణ అనుమతులంటున్నారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమంటూ సీఎం, మంత్రి హరీష్‌రావులు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సారెస్పీ, ఎల్ఎండి, వరదకాలువ, ఎల్లంపల్లి సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే నిర్మించారనే విషయాన్ని మరిచిపోకూడదన్నారు. వరద కాలువలో మిగిలిపోయిన కొద్దిపాటి పనులను చేస్తూ విస్తృత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మంత్రి హరీష్‌రావు అబద్దాల బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కాంగ్రెస్‌పార్టీపై అబద్దాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇరిగేషన్ శాఖకు కేటాయించిన నిధులు, చేసిన పనులు, టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్లలో చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2013 భూసేకరణ చట్టం అమలు చేయటంలేదని బాధిత రైతులు కోర్టుకు వెళితే కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. జీఎస్టీతో అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళతామని చెప్పిన కేసీఆర్ అదే విధంగా పరిహారం చెల్లింపులో తమకు అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళ్లిన రైతులను ఎలా తప్పుపడుతున్నారని అన్నారు. మేడిగడ్డ-తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు తగ్గించి తెలంగాణ ప్రజల పరువును మహారాష్ట్రకు తాకట్టు పెట్టిన టీఆర్ఎస్ ప్రభుత్వం సంబరాలు చేసుకుందని విమర్శించారు. కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కరీంనగర్ జెడ్పీ సమావేశంలో సభ్యులు తీర్మాణం చేయాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జడ్పీలో ఉన్న అన్ని రాజకీయ పక్షాల జడ్పీటీసీ, ఎంపీపీ, ఇతన సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమకు లేఖను పంపిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒక వేళ కరీంనగర్‌లో వైద్య కళాశాల అవసరంలేదనుకుంటే ఆ మేరకే తీర్మాణం చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మేయర్ డి శంకర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల ప్రకాశ్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు దిండిగాల మధు, మాజీ కార్పొరేటర్‌లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిశేఖర్, ఎలగందుల మునీందర్, పొన్నం సత్యనారాయణ, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈఎన్‌సీ అనిల్ కుమార్

తిమ్మాపూర్: మధ్యమానేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టుల ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ కరీంనగర్(ఈఎన్‌సీ) అనిల్ కుమార్ తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 2.2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.33 టీఎంసీ నీటి నిల్వ ఉందన్నారు. ఇన్‌ఫ్లో ప్రస్తుతం 1058 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో ప్రస్తుతం ఏమీ లేదన్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహక ప్రాంతాల నుంచి భారీగా ఎగువ మానేరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఉన్నదన్నారు. దీని వల్ల ఎగువ మానేరు నిండిన వెంటనే మధ్య మానేరు రిజర్వాయరులోకి నీరు వచ్చే అవకాశముందన్నారు. కాబట్టి మిడ్ మానేరు కింది పరివాహన ప్రాంతాల్లోని ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి ఏకలవ్య కబడ్డీ క్రీడలు

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ ఎరుకల యువజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి ఏకలవ్య కబడ్డీ క్రడలను నిర్వహించనున్నామని ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాతవాహన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి ఎరుకల విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. ఏకలవ్య కబడ్డీ క్రీడలను కేవలం ఎరుకల కులస్తుల కోసం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కబడ్డీ జట్లు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పోటీల్లో ప్రథమ స్థానానికి 20 వేలు షీల్డు, ద్వితీయ స్థానానికి 10 వేలు షీల్డు, తృతీయ స్థానానికి 5 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నామని తెలిపారు. సమావేశంలో విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు బిజిలి తిరుపతి, రాష్ట్రసహాయ కార్యదర్శులు ఉండాడి సాగర్, సమ్ములు, అంజనిప్రసాద్, మొగిలి సమ్మయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజేందర్, అంజయ్య, కనకయ్య, పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు వరద నీరు

● ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ● ప్రాజెక్ట్‌లోకి 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
● 1 టీఎంసీ పెరిగిన నీటిమట్టం ● ఎస్సారెస్పీ నీటిమట్టం 27.738 టీఎంసీలు

ఆంధ్రజ్యోతి, జగిత్యాల : శ్రీరాంసాగర్‌కు మళ్లీ వరద నీరు వచ్చి చేరుతుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్ట్‌లోకి ఆదివారం 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఒక్క రోజే ఒక టీఎంసీ నీటిమట్టం పెరిగింది. మహారాష్ట్ర ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల బాలెగావ్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో ఆదివారం ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చింది. ఆదివారం ఉదయం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 26.814 టీఎంసీ(1068.90 అడుగులు)లు ఉండగా, మధ్యాహ్నం 1 గంట వరకు 25,645 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. మూడు గంటల వరకు 26,375 క్యూసెక్కులకు పెరిగింది.

దీంతో ప్రాజెక్ట్‌లోకి ఈ ఒక్క రోజే ఒక్క టీఎంసీ నీరు వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. శ్రీరాంసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 90.31 టీఎంసీ(1091 అడుగులు)లు కాగా, ఆదివారం సాయంత్రం నాటికి 27.738 టీఎంసీ(1069.40 అడుగులు)లకు చేరుకుంది. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్ట్ నీటిమట్టం 37.379 టీఎంసీ(1074 అడుగులు)లుగా ఉంది.



శ్రీరాంసాగర్‌లో పెరిగిన నీటిమట్టం

అవినీతి అధికారితో రాజీపడలేకే శ్రీకాంత్ ఆత్మహత్య

● మరణవాంగ్మూలం కూడా పట్టించుకోరా? ● సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

వెల్గటూర్: అవినీతి అధికారితో రాజీ పడలేకే దేవీ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయితీ యువ ఇంజనీర్ దేవి శ్రీకాంత్ మృతికి కారణమైన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎండపెల్లిలో శ్రీకాంత్ కుటుంబీకులను జీవన్‌రెడ్డితో పాటు జడ్పీ మాజీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి పెరుగుతోందన్నారు. శ్రీకాంత్ మృతి ప్రభుత్వ అవినీతికి, ఉన్నతాధికారుల నియంతృత్వ ధోరణికి అద్దం పడుతోందన్నారు. నిర్మల్ డివిజన్ పంచాయితీరాజ్ ఈఈ రఘు వీరారెడ్డి వేధింపులకు తలొగ్గలేకనే యువ ఇంజనీర్ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈఈ రఘువీరారెడ్డి వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకుంటున్నాని మరణ వాంగ్మూలం (సూసైడ్‌నోట్) రాసినా పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు అధికారిపై ఇప్పటి వరకు చర్యలు చేపట్టక పోవడం ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనం అని ఎద్దేవా వేశారు. ఈఈ రఘువీరారెడ్డి పరారీలో ఉన్నాడని అతనిని పట్టుకోడానికి రెండు స్పెషల్ పార్టీలు ఏర్పాటు చేశామని ఎస్పీ అనడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయితీరాజ్ శాఖ మంత్రి, ఇంజనీర్ ఇన్ చీఫ్ దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం శ్రీకాంత్ కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు అతడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శంకర్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ చుక్క శంకర్‌రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, నాయకులు జితేంధర్ రెడ్డి, శ్రీను, సంజీవ్‌రెడ్డి, సతీష్, మురళి పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.





మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.





సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.





తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.





ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.





కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.



-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా విశ్వఘ్నచారి

తంగళ్లపల్లి: మండల బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షునిగా సజ్జనం విశ్వఘ్నచారి ఎంపిక అయ్యారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం మండల నూతన కమిటిని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యాక్షులుగా పరమేశ్వర్, గౌరవ్వ, కార్యదర్శులుగా సత్తయ్య, లక్ష్మిభాయిలను ఏకగ్రీవంగా ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ రవీందర్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు దేవదాస్, జయరామ్, దేవయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విరసం మాజీ సభ్యుడు మృతి

● సంతాపం ప్రకటించిన రచయితలు


తోట మహాదేవ్ (ఫైల్ ఫొటో)

సిరిసిల్ల రూరల్ : విరసం మాజీ సభ్యుడు, సెస్ రిటైడ్ ఉద్యోగి తోట మహాదేవ్ (60) ఆనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇల్లంతకుంట మండలం వేపాక గ్రామానికి చెందిన మహాదేవ్ 1983లో సిరిసిల్లలోని సహకార విద్యుత్ సరఫరా సంస్థలో క్లర్క్‌గా ఉద్యోగంలో చేరి 2017లో పదవీ విరమణ చేశారు. సంస్థలో పని చేస్తూ 1984లో విరసం సభ్యుడిగా పనిచేశాడు. ఆ సమయం లో సంకెళ్లు, తూర్పు, ఉరుములు మెరుపులు కవితా సంకలనాలు వెలువరించారు. కల్లోలం కవితా బులిటెన్‌ను కొనసాగించారు. 25 రోజుల క్రితం ఆనారోగ్యానికి గురవ్వడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం సిరిసిల్ల మండలం చంద్రంపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. మహాదేవ్ భార్య నీరజ, కొడుకు అర్జున్, కుమార్తెలు అంజలి, ఆమని, అశ్వినిలను ఆదివారం సాయంత్రం అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, రచయితలు నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్ కుమార్, మ ద్దికుంట లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్‌లు పరామర్శించారు.

జనావాసాల మధ్య బార్‌తో ఇబ్బంది

ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల : సిరిసిల్ల కార్మిక వాడ శాంతినగర్‌లో జనావాసాల మధ్య బార్ మరియు రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని శాంతినగర్ యువకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. బార్ ఇండ్ల మధ్యలో ఉండటంతో మహిళలు భయాందోళనకు గురవుతున్నారని రోడ్డుపై నడవడానికి కూడా ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు.

'ప్రజలను మభ్యపెడుతున్న తెలంగాణ సర్కార్'


మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్ : తెలంగాణా ప్రజలను కేసీఆర్ ప్రభుత్వం మభ్యపెడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం మట్ట వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణా ప్రభుత్వం మాయమాటలతో నమ్మిస్తూ మాటల గారడి చేస్తుందన్నారు. ఎక్కడో ఉన్న పోచంపాడు, కాళేశ్వరం కోసం ఇక్కడి రైతాంగాని నమ్మిస్తుందని, అధికారులు సైతం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎగువమానేరును విడిచి ఇతర ప్రాజెక్టులపై దృష్టిసారించడంపై మండిపడ్డారు. రైతులకు కోసం ఇతర ప్రాజెక్టులు నింపడం మంచిదే కాని మంత్రి కేటీఆర్ సొంత నియోజక వర్గంలోని మానేరులో కనీసం పూడికతను కూడా తీయలేదని మండిపడ్డారు. మానేరుకు పుపర్వైభవం వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గాడిచర్ల శ్రీనివాస్, మల్లారపు సంతోష్ రెడ్డి, కార్తీకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను దోచేస్తూ

ప్రాణాలు హరిస్తున్నారు

● ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టిస్తున్నారు ● నేరెళ్ల బాధితులను ఆదుకోవాలి ● ఉస్మానియా ప్రొఫెసర్ కాసీం

వేములవాడ / తంగళ్లపల్లి: తెలంగాణలో సహజ వనరులను దోచేస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం ధ్వజమెత్తారు. ఆదివారం తంగళ్లపల్లి మండలంలో పోలీసు బాధిత కుటుంబాలతో పాటు లారీ ప్రమాదంలో మృతిచెందిన భూమయ్య కుటుంబాన్ని ప్రొఫెసర్ ఖాసీం, బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఇక్కడి వనరులను ఇతరులు దోచుకు వెళ్తున్నారని మాట్లాడిన కేటీఆర్ అధికారంలోకి రాగానే మాటలను విస్మరించాడని విమర్శించారు. ఇసుక తెలంగాణకు దక్కాలి కాని నిత్యం వేలాది లారీలలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు.లారీలను కాల్చితే ఎనిమిది మందిని చిత్ర హింసలకు గురి చేయడాన్ని తప్పుపట్టారు. చిత్రహింసలకు గురి చేసిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జీతో కమిటిని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని అన్నరు. గాయలైన వారిని నిమ్స్ అసుపత్రికి తరలించి కార్పొరేట్ వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నడుస్తున్న తెలంగాణ ఎడిటర్ స్నేహలత, ప్రిన్సిపాల్ డాక్టర్ సిల్మా నాయక్, రీసెర్చ్ స్కాలర్ ప్రతాప్, మర్వాడి సుదర్శన్, థామస్, మహేశ్ తదితరులు ఉన్నారు.


నేరెళ్ల బాధితులను పరామర్శిస్తున్న ఉస్మానియా బృందం

నేరెళ్ల బాధితులను ఆదుకోవాలి

వందలాది మంది అమరుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం స్వార్థపరుల చేతుల్లో బందీగా మారిందని నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక సంపాదకుడు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం అన్నారు. వేములవాడలో ఆశ్రయం పొందిన నేరెళ్ల బాధితులను ఉస్మానియా బృందం ఆదివారం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గ్రానైట్ గుట్టలు, ఇసుక తదితర సహజ వనరులు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించినందుకు నేరెళ్ల వాసులను అక్రమంగా పట్టుకుని చిత్రహింసలకు గురిచేశారని అన్నారు.

ఇప్పటికైనా దళితులు, వెనుకబడిన వారిపై వేధింపులు నిలిపివేయాలని, నేరెళ్ల బాధితులను ఆదుకుని, చిత్రహింసలకు పాల్పడిన పోలీసులపై రాజ్యాంగం ప్రకారం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్నేహలత, సిల్మానాయక్, ప్రతాప్, ఎంఆర్‌పీఎస్ నాయకుడు థామస్, మార్వాడి సుదర్శన్, రాజయ్య, మల్లేశం, బొజ్జ కనకయ్య పాల్గొన్నారు.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కాదు...

● కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్ : కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కొరకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కాదని టీఆర్ఎస్ కార్యకర్తల అభిప్రాయ సేకరణ తప్ప ఇంకొకటి కాదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు గానీ, ప్రభుత్వం గానీ ప్రజలతో స్వచ్ఛందంగా నిర్వహించకుండానే టీఆర్ఎస్ పార్టీ నాయకులతో నిర్వహించారని, వాటప్స్‌ల ద్వారా మేసేజులు పంపుకొని అభిప్రాయ సేకరణ జరిగిందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు జలగం ప్రవీణ్, వెలమల తిరుపతిరెడ్డి, బైరినేని రాము, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

అది పార్టీ అభిప్రాయ సేకరణ..

గంభీరావుపేట : నర్మాల ఎగువ మానేరు వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగింది ప్రజాభిప్రాయ సేకరణ కాదని, అది కేవలం టీఆర్ఎస్ పార్టీ అభిప్రాయ సేకరణ మాత్రమేనని జిల్లా కాంగ్రెస్ నాయకుడు కటకం శ్రీధర్ ఆరోపించారు. గంభీరావుపేటలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ అంటే అందరికి మాట్లాడే హక్కు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎగదండి స్వామి, ఎంపీటీసీ హమీద్, ఉప సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు వేశాల వెంకటి, నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, నాగయ్య, జంగం రాజులు, గుడికాడి బాలయ్య, ప్రబాకర్, రంగారావు, రాజు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ప్రశ్నించే గొంతులను నొక్కుకున్నారు

● కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికలు వెల్లడించారు
● పీసీసీ అధికార ప్రతినిధి ఉమేష్‌రావు

ఆంధ్రజ్యోతి సిరిసిల్ల: ప్రశ్నించే గొంతులను దౌర్జన్యంగా నొక్కివేస్తూ నర్మాల వద్ద టీఆర్ఎస్ సభను జరిపారని పీసీసీ అధికార ప్రతినిధి ఉమేష్‌రావు అన్నారు. ఆదివారం సిరిసిల్ల విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మళ్లించే ప్రాజెక్టు రిపోర్టు, పూర్వోపరాలను ముందుగా వెల్లడించి ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉందని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎవరూ వ్యతిరేకం కాదని ప్రజలను మభ్యపెట్టడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో కేవలం టీఆర్ఎస్ సభను నిర్వహించారని దీనికి కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులు హాజరైనట్లుగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇప్పటివరకు సర్వేలో ఏ సామాజిక వర్గానికి చెందిన భూముల పోతున్నాయే తెలపడం లేదన్నారు. ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి వచ్చిన వారిని దౌర్జన్యంగా అరెస్టు చేశారని అన్నారు. కంటితుడుపు చర్యగానే అభిప్రాయ సేకరణ జరిగిందన్నారు.

గుడుంబా రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

● ఏకతాటిపై ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయి
● మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట : గుడుంబా రహత సమాజ నిర్మానమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని అనంతగిరి, పెద్దలింగాపూర్ గ్రామాల్లో గుడుంబా అమ్మకాలు జరిపి నిలపివేసిన వారికి పాడిగేదెలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రసమయి మాట్లాడుతూ గుడుంబా అమ్మకాలు సాగించిన వారికి ప్రభుత్వం ప్రత్యమ్నాయ మార్గాలు చూపెట్టడం జరుగుతుందన్నారు. ఒక్కొక్కరికి రూ 2లక్షల ఆర్థిక సహాయం చేస్తామని అన్నారు. ప్రాణాంతకమైన గుడుంభాను సేవించడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అయిలయ్య, జడ్పీటీసీ సిద్దం వేణు, సెస్‌డైరెక్టర్ గుండ సరోజన ముత్తయ్య, ఉపాధ్యక్షుడు దొంతి మల్లయ్య, టీఆర్ఎస్ అధ్యక్షుడు గొడుగు తిరుపతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సంధ్యారాణి, ఎక్సైజ్ ఎస్ఐ భారతి, సర్పంచ్‌లు గుర్రం భూపతిరెడ్డి, అరుకాల శ్రీమతి, మాతిరెడ్డి మంజులకిషన్‌రెడ్డి, కముటం లావణ్యారాములు, ఎంపీటీసీలు తిరుపతిరెడ్డి, బొప్స నర్సయ్య, నాయకులు మీసరగండ్ల అనీల్‌కుమార్, ఏనుగుల బుచ్చిరెడ్డి, గొల్ల మల్లారెడ్డి, తడకపెల్లి భూమయ్య, చొప్పరి ఆంజనేయులు, గుండ వెంకటేశం, నర్సయ్యలతో పాటు వివిద గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పాడిగేదెలను పంపిణీ చేస్తున్న రసమయి

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

మండలంలోని రేపాక, అనంతగిరి గ్రామాల్లో మృతుల కుటుంభీకులను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. రేపాక గ్రామానికి చెందిన ఖజాభీ మరణించగా అలీం, సలీంలతో పాటు అనంతగిరి గ్రామానికి చెందిన గోపాల్‌లను పరామర్శించారు. మృతిచెందడానికి గల కారణాలు అడిగి తెలుసుకొని సానుభూతిని వ్యక్తపరిచారు.

ఇల్లంతకుంట: సంఘంలోని సభ్యులందరూ ఏకతాటిపై ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట, పెద్దలింగాపూర్ గ్రామాల్లో ఆదివారం కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రసమయి మాట్లాడుతూ ప్రభుత్వం కులవృత్తులను అభివృద్ధి చేయడం ద్వారానే బంగారు తెలంగాణ సాధ్యం అవుతుందని గుర్తించి అన్నికులాలకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పాటుపడటం జరుగుతుందన్నారు. దళితులు తొలుత విద్యావంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అయిలయ్య, జడ్పీటీసీ సిద్దం వేణు, సెస్‌డైరెక్టర్ రమణారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ గుండ సరోజనముత్తయ్య, ఉపాధ్యక్షుడు దొంతి మల్లయ్య, టీఆర్ఎస్ అధ్యక్షుడు గొడుగు తిరుపతి, నాయకులు కముటం లావణ్య, మంజులకిషన్‌రెడ్డి, భూపతిరెడ్డి, శ్రీమతి, బొప్ప నర్సయ్య, తిరుపతిరెడ్డి, అనీల్ కుమార్, గొల్ల మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, చల్ల నారాయణ, మల్లయ్య, రాజిరెడ్డి, కొమురయ్యలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3.Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!





'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.

- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?
మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.
లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన
జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▸ ....
2. వియోనిగం ▸ ....
3. భాతంసుప్ర ▸ ....
4. చాపంయతి ▸ ....

చుక్కలు కలపండి



ఆటల్లో ఆణిముత్యాలు

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థినుల ప్రతిభ
- కిక్‌బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణింపు
- ప్రోత్సాహమందిస్తే మరిన్ని పతకాలు



సాయిదుర్గను అభినందిస్తున్న ఎంపీ. కవిత



బంగారు పతకంతో బీర్‌పూర్ సుప్రియ



పతకాలతో సాయిదుర్గ

సారంగాపూర్: ఇద్దరు ఇద్దరే.. బరిలో దిగితే పతకం ఖాయం. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన మడ్డి సాయిదుర్గ, బీర్‌పూర్ సుప్రియ పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు వెయింట్ లిఫ్టింగ్, కిక్ బాక్సింగ్ విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ పతకాల పంట పండిస్తున్నారు. కోచింగ్ లేకుండా సొంతగా ప్రాక్టీస్ చేస్తూభేష్ అనిపించుకుంటున్నారు. కోచింగ్ ఇప్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తామని పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

గ్రామానికి చెందిన మడ్డిపద్మ, రాజేశం దంపతుల కుమార్తె సాయిదుర్గ. ఐదేళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి పద్మ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పాఠశాల స్థాయిలో సాయిదుర్గ ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయి పోటీలకు వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఎంపిక చేశారు. ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో అనేక పతకాలు సాధించింది. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో జరిగిన పోటీల్లోనూ స్వర్ణం గెలుచుకుంది. కర్నాటక, హైదరాబాద్, విజయవాడ, కేరళ, మహారాష్ట్రలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఐదు బంగారు, ఒక సిల్వర్ పతకం కైవసం చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన మరో విద్యార్థిని బీర్‌పూర్ సుప్రియ. తల్లిదండ్రులు విజయ, రాజిరెడ్డి వ్యవసాయం చేస్తారు. సుప్రియ చిన్ననాటి నుంచి ఆటల్లో రాణిస్తుండడం, పాఠశాల స్థాయి పోటీల్లో చురుకుగా పాల్గొనడం గమనించిన ఉపాధ్యాయులు, తండ్రి రాజిరెడ్డి ప్రోత్సాహమందించారు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పసడి పతకాల పంట పండిస్తోంది. మధ్యప్రదేశ్, పంజాబ్, రంగారెడ్డి, విజయవాడ, కేరళ, మహారాష్ట్ర, కర్నాటకల్లో నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఆరు బంగారు, ఒక సిల్వర్ పతకం కైవసం చేసుకుంది. నిజామాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విజయవాడల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏడు బంగారు, ఒక సిల్వర్ పతకం సొంతం చేసుకుంది.

నిమజ్జనానికి నీరేది...

- మానకొండూర్ చెరువులో నీటిని నింపడానికి ప్రయత్నించని అధికారులు
- ఆందోళనలో భక్తులు

మానకొండూర్: ఈ యేడు మానకొండూర్ మండలంలో ఆశించిన మేరకు వర్షాలు పడలేదు. దీంతో ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటలలో నీరు లేకుండా పోయింది. మానకొండూర్ చెరువులో 22 ఏళ్లుగా కరీంనగర్‌కు చెందిన వందలాది గణేష్ విగ్రహాలతో పాటు మండలంలోని మానకొండూర్, సదాశివపల్లి, ముంజంపల్లి, శ్రీనివాస్‌నగర్, తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్ గ్రామాలకు చెందిన గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. 22 ఏళ్లుగా మూడు క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో ఆ ప్రదేశం పూడికతో నిండిపోయింది. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలతో నీరు ఎరుపు రంగుగా మారి పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడమే కాకుండా చేపలు మృత్యువాత పడుతున్నాయి. స్నానాలకు వెళ్లిన యువకులకు దురదలేచి కంతులు ఏర్పడుతున్నాయిని పలుమార్లు అధికారుల దృష్టి కి తీసుకెల్లిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గత సంవత్సరం మిషన్ కాకతీయ పథకానికి మానకొండూర్ చెరువు ఎంపికైంది. సంబంధిత కాంట్రాక్టర్ చెరువు చుట్టు ప్రక్కల పూడికతీత చేపట్టి విగ్రహాలు పడే స్థలంలో పూడికతీత చేపట్టక పోవడంతో పరిస్థితి ఎప్పటి లాగే ఉంది. చెరువు కట్ట మరమ్మతుల్లో బాగంగా కట్టను వెడెల్పు చేసి ఎత్తుగా నిర్మించారు. దీంతో చెరువులో ఉన్న నీటిలో క్రేన్‌ల సహాయంతో చేస్తే ఏ ఒక్క విగ్రహం మునిగిపోయే అవకాశం ఉండదని ఓకే ప్రదేశంలో గుట్టలు గుట్టలుగా ఏర్పడి నిమజ్జనానికి ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నెల 25న ప్రతిష్టించిన విగ్రహాలు నవరాత్రోత్సవాలు జరుపుకొని సెప్టెంబర్ 2న నిమజ్జనాకి వెళతాయి. అందులో బాగంగా చెరువులో నిమజ్జనానికి సరపడా నీరు లేకపోవడంతో గ్రామ పంచాయితీ పాలకవర్గం ఎల్ఎండీ నుంచి కాకతీయ కాల్వ ద్వారా మానకొండూర్ చెరువులోకి నీటిని సరఫరా చేయాలని వారం రోజుల క్రితం కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. అయినా అధికారలు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టక పోవడంతోగ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాకతీయ కెనాల్ ద్వారా చెరువులోకి నీటి ని సరఫరా చేయాలని భక్తులు కోరుతున్నారు.



నీరు లేక వెలవెల పోతున్న మానకొండూర్ చెరువు

అధ్వానంగా రహదారులు..

- చిరు జల్లులకే చిత్తడిగా మారిన పల్లె రోడ్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



కాసారం, గర్శకుర్తి గ్రామాల మధ్య అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

గంగాధర : ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాల్సిన పాలకులు, అధికార యంత్రాంగ పట్టింపు లేని దోరణి వల్ల గంగాధర మండలంలోని పలు గ్రామాల రోడ్లు చిరు వర్షపు జల్లులకే అధ్వానంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు.ఇటీవల కురిసిన చిరు వర్షాలకు గుంతలు పడిన మట్టి రోడ్లపై నీరు నిలిచి చిత్తడిగా మారాయి. మండలంలోని హిమ్మత్ నగర్ గ్రామం నుంచి వెదిర వరకు గల మూడు కిలో మీటర్ల రోడ్డు అడుగడుగున గుంతలు పడి వర్షాలకు గుంతల్లో నీరు నిలిచాయి. ఈ రూట్లో వెళ్లే హిమ్మత్‌నగర్, గట్టుభూత్కూర్ గ్రామాల ప్రజలువాహనాలు, నడిచి వెళ్లలేక అనేక అవస్థలు పడుతున్నారు. తాడిజెర్రి నుంచి హిమ్మత్ నగర్ వచ్చే రోడ్డు మరి అధ్వానంగా మారింది. కాసారం, తడగొండ వెళ్లాల్సిన గర్శకుర్తి గ్రామం మీదుగా వెళ్లే రహదారి కూడా అనేక చోట్ల గుంతలు పడి నీరు నిలిచి పాదచారులు నడిచి వెళ్లలేని విధంగా తయారు అయ్యింది. గర్శకుర్తి తడగొండకు నాలుగు కిలో మీటర్లు, కాసారం నుంచి గర్శకుర్తికి మూడు కిలో మీటర్ల పొడవున రోడ్డు చిత్తడిగా మారి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. తిర్మలపూర్ నుంచి కోట్ల నర్సింహులపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రానైట్ లారీలు ఓవర్ లోడ్‌తో నడవడం వల్ల మట్టి రోడ్లతోపాటు గంగాధర చౌరస్తాలోని తారు రోడ్డు ప్రజలు నడువలేని విధంగా మారాయి.అధికార యంత్రాంగం ఈ రహదారిపై నుంచే వచ్చి వెళ్తున్నా పట్టించుకున్న వారే కరవు అయ్యారు. సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పట్టించుకుని రోడ్లకు కనీస మరమ్మతులు చేట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హిమ్మత్‌నగర్, వెదిర మధ్య బురదమయంగా మారిన రహదారి

ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు



● సిరిమల్ల చంద్రమోహన్, సర్పంచ్, హిమ్మత్‌నగర్

హిమ్మత్‌నగర్ నుంచి వెదిర, తాడిజెర్రి నుంచి హిమ్మత్‌నగర్ వచ్చే రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. జీపీలో నిధులు లేక కనీసం మొరం పోసే వీలులేకుండా ఉంది.

ఆర్భాటం కోసమే

కాళేశ్వరం రివర్స్ పంపింగ్ పనులు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సాగర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్ రావు

జగిత్యాల టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటం కోసమే కాళేశ్వరం రివర్స్ పంపింగ్ పనులను చేపట్టిందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. జిల్లాలోని మల్యాల మండలం పోతారం, రాంపూర్ గ్రామాల మధ్య పంప్‌హౌస్ నిర్మాణం కోసం రైతులను బెదిరించి భూసేకరణ చేశారని ఆరోపించారు. ఆర్డీవో స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఎకరాకు రూ.11.50లక్షల పరిహారంతోపాటు క్రాఫ్ డ్యామేజ్ కింద 1.50లక్షలు ఇస్తామని చెప్పిన హామీలు మాటలకే పరిమితమయ్యాయన్నారు. రాత్రికి రాత్రే 32మంది రైతులకు పరిహారం కింద ఎకరాకు 10లక్షల పేరుతో సెప్టెంబరు 20వ తేదీన పోస్ట్‌పెడ్ చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారన్నారు. పరిహారం విషయంలో కలెక్టర్ శరత్ ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ భూమితోపాటు డబుల్ బెడ్ రూం ఇల్లు, అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొప్పలు చెప్పుకునేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు పనులను చేపడుతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ల మెప్పుకోసం కాదు రైతుల బాగోగుకోసం ప్రభుత్వం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి భోగ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న, నాయకులు బాలె శంకర్, వొల్లం మల్లేశం, హనుమండ్ల జయశ్రీరఘు, వొల్లాల గంగాధర్, నవ్వోతు రవీందర్, వనమాల నిరంజన్, కొండ శ్రీధర్, గుగ్గిళ్ల సత్యనారాయణ, కిషన్ రెడ్డి, రైతులు గొట్టం గంగాధర్, నారాయణ, నర్సయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 1.9 మిల్లీమీటర్ల వర్షం

ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం స్వల్ప వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 1.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల్లో రుద్రంగి 2.3 మిల్లీమీటర్లు, బోయినపల్లిలో 0.15 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 1.7 మిల్లీ మీటర్లు, కోనరావుపేటలో 14.8మిల్లీమీటర్లు, వీర్నపల్లిలో 2.3మిల్లీమీటర్లు, గంభీరావుపేటలో 2.75మిల్లీ మీటర్లు, ముస్తాబాద్‌లో 0.33 మిల్లీమీటర్లు, ఇల్లంతకుంటలో 0.2 మిల్లీమీటర్లు చొప్పున వర్షం కురిసింది.

విద్యతో విజ్ఞానాన్ని పెంచుకోవాలి

● ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి

ముస్తాబాద్ : ఉద్యోగం కోసం విద్య కాదని.. విద్యతో విజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్‌లో వెన్నెల జూనియర్ కళాశాల, శ్రీమిత్రా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఛైర్మన్ ఎస్‌వీసీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మొదటగా జ్యోతి ప్రజ్వళన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాపిరెడ్డి మాట్లాడుతూ విద్యతో ఆత్మస్థైర్యం, ధైర్యం, ప్రపంచజ్ఞానం పెరుగుతుందన్నారు.

అలాగే రాష్ట్ర ఉపాధిహామీ డైరెక్టర్ కార్తికేయ మాట్లాడుతూ విద్యార్థులు ముందు ప్రణాళికను ఏర్పాటు చేసుకొని లక్ష్యంను చేరుకునేందుకు కష్టపడాలన్నారు. కమ్యునికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగ యవతకు ఉపాధి కల్పించాలని తెలంగాణా ప్రభుత్వం శ్రమిస్తుందని త్వరలోనే పెద్దఎత్తున ఇక్కడ జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కళాశాలల ఛైర్మన్ ఎస్‌వీసీ ప్రకాశ్, ఈజీఎంఎం రాష్ట్ర డైరెక్టర్ కాసుగంటి శ్రావణ్‌రావు, ఎఎంసీ ఛైర్మన్ బత్తుల అంజయ్య, సహకార సంఘం ఛైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ జంగం సిద్దయ్య, గజ్జెల రాజు, కళాశాలల యునియన్ ప్రతినిధులు దిడ్డి శ్రీనివాస్, జగన్, వెంకన్న, భూమేశ్, అధ్యపకు నర్సయ్య, సంతోష్‌రెడ్డి, గుండెల్లి శ్రీనివాస్, కిరణ్‌తేజ, చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాలకు రాజకీయ రంగు

ఆంధ్రజ్యోతి, జగిత్యాల: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి అక్కడికక్కడే ధర నిర్ణయించడంతో పాటు రైతు సమస్యలకు గ్రామ స్థాయిలోనే పరిష్కారం చూపేందుకు ఏర్పాటు కానున్న రైతు సంఘాలకు రాజకీయ రంగు అంటుకుంటోంది. గ్రామ స్థాయిలో రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలను పురమాయించడంతో గ్రామాల్లో మళ్లీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. దుక్కులు దున్నుకొని పంటలు వేసుకోవడంలో బిజీగా ఉన్న రైతుల చుట్టూ మళ్లీ రాజకీయ ప్రతినిధులు తిరుగుతున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 9వరకు రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో గ్రామస్థాయిలో రైతు సంఘాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

● జిల్లాలో 266 రైతు సంఘాలు

రైతుల భూ సమస్యలు, గిట్టుబాటు ధర, ఇతర సమస్యలకు పరిష్కారం చూపాలనే ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రెవెన్యూ గ్రామానికి ఒక రైతు సంఘంతోపాటు మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు వ్యవసాయేతర పనులపై ఆధారపడిన రైతులు దాదాపు 8లక్షల మంది వరకు ఉంటారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన వారు 1,55,181 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,45,218 హెక్టార్ల సాగుకు యోగ్యమైన భూమి ఉంది. జిల్లాలో 75 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇప్పుడు ప్రభుత్వం రైతు సమన్వయ సమితి పేరిట ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో రైతు సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో 266 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లో 183, మెట్‌పల్లి డివిజన్‌లో 83 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయనుండడంతో గ్రామాలవారీగా రైతుల వివరాలను సేకరిస్తున్నారు.

● 12 మందితో గ్రామ రైతు సమన్వయ సమితి

ఒక్కో రెవెన్యూ గ్రామంలో ఏర్పాటు చేయనున్న రైతు సమన్వయ సమితిలో 12 మంది గ్రామ రైతులు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలోనైతే 15 మంది రైతులతో మండల సమన్వయ సమితి, జిల్లాలోనైతే 24 మందితో జిల్లా రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేస్తారు. గ్రామ రైతు సమన్వయ సమితిలో స్థానిక రైతులందరినీ సభ్యులుగా చేర్చి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తారు. జిల్లాలో 266 రెవెన్యూ గ్రామాలకు ఒక్కో గ్రామంలో 12 మందితో కమిటీ ఏర్పాటు కానుంది. దీంతో 3192 మందితో గ్రామ స్థాయిలో రైతు సంఘాలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో 18 మండలాలు ఉండగా, మండల రైతు సమన్వయ సమితి 15 మందితో ఏర్పాటు కానుంది. దీనిలో 270 మందితో మండలాల స్థాయిలో రైతు సంఘాలు ఏర్పాటవుతాయి. జిల్లా రైతు సమన్వయ సమితిలో 24 మందిని సభ్యులుగా తీసుకుని, జిల్లా రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేస్తారు. ఈ రైతు సమితీలు రానున్న రోజుల్లో కీలకంగా మారనుండడంతో అధికార పార్టీ నాయకులు అప్పుడే దృష్టి కేంద్రీకరించారు. ఒక్కో నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు మండలాలు ఉండడంతో తమకు అనుకూలంగా ఉన్న వారినే రెవెన్యూ గ్రామాల్లో సభ్యులుగా చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. మండల స్థాయి, జిల్లా స్థాయిలో కూడా రాబోవు రోజుల్లో తమకు ఉపయోగపడేవారే రైతు సమన్వయ సమితిలో సభ్యులుగా ఉండేలా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. జిల్లా స్థాయిలో 24 మందితో ఏర్పాటు కానున్న రైతు సమన్వయ సమితి రానున్న రోజుల్లో కీలకంగా మారనుండడంతో తమ ముఖ్య నాయకులు, అనుయాయులను కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం గ్రామాలవారీగా రైతుల వివరాలను తెప్పించుకుంటున్నారు. జిల్లా జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలతో పాటు వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని రెండేసి మండలాలతో ఏర్పడింది. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గెలుపొందగా, టీఆర్ఎస్ ఇన్‌చార్జిగా డాక్టర్ సంజయ్ కుమార్ కొనసాగుతున్నారు. ఎమ్మెల్యేలు లేనిచోట ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో కరీంనగర్ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావుకు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. జగిత్యాల నియోజకవర్గం పరిధిలోకి జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో రైతు సమన్వయ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ధర్మపురి ఎమ్మెల్యేగా ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ వ్యవహరిస్తుండగా, ధర్మపురి నియోజకవర్గం పరిధిలోకి ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, పెగడపల్లితో పాటు పెద్దపల్లి జిల్లా పరిధిలో ఉండే ధర్మారం మండలం ఉంటుంది. ఆయన తనకు అనుకూలంగా ఉన్నవారి చేత కమిటీలను రూపొందించుకోనున్నారు. కోరుట్ల ఎమ్మెల్యేగా విద్యాసాగర్ రావు కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోకి కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలు ఉన్నాయి. ఆయనకు అనుకూలంగా ఉన్నవారికి కమిటీలో సభ్యులుగా అవకాశం లభించనుంది.

నిబంధనల మేరకు సంఘాల ఏర్పాటు

-భాగ్యలక్ష్మి, డీఏవో, జగిత్యాల



